ఈదులకుంటను కాపాడాలి

శేరిలింగంపల్లి: ఖానామెట్‌లోని ఈదులకుంటను ఆక్రమణల నుంచి కాపాడాలని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజన్సీ (హైడ్రా) కమిషనర్ రంగనాథ్‌కు సీపీఎం శేరిలింగంపల్లి కార్యదర్శి సి.శోభన్ సోమవారం వినతిపత్రం అందజేశారు. ఖానామెట్ సర్వే నంబర్ 7లోని ఈదులకుంట 6 ఎకరాల 5 గుంటలు ఉన్నప్పటికీ, కుంటను పూడ్చివేసి ఆక్రమించారని వివరించారు. తమ్మిడి చెరువు నాలా నుంచి ఈదులకుంటకు వచ్చే వరదను మళ్లించారని వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మాణిక్యం, కృష్ణ, వరుణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి.. 13 వినతులు



ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న డీసీ రజనీకాంత్‌రెడ్డి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 13 ఫిర్యాదులు వచ్చాయి. పింఛన్లకు 7, టౌన్ ప్లానింగ్‌కు నాలుగు, శానిటేషన్ 1, ఇంజనీరింగ్ విభాగానికి 1 చొప్పున దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు.

మియాపూర్ పీఎస్‌ను సందర్శించిన డీసీపీ

మియాపూర్: మాదాపూర్ డీసీపీ వినీత్ సోమవారం మియాపూర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో ఉన్న రికార్డులను పరిశీలించారు. సీఐ, ఎస్‌ఐలతో మాట్లాడి ఆయా కేసుల పూర్వపరాలనుఅడిగి తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో సీఐ దుర్గారామలింగా ప్రసాద్, ఎస్‌ఐలు రాజేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, నర్సింహారెడ్డి ఉన్నారు.





మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం రోడ్డులో గుంతలు పడ్డ రోడ్లు



మియాపూర్ కృషినగర్ వద్ద కుంగిన సిమెంట్ రోడ్డు

ఏ రోడ్డు చూసినా గుంతలే..

- రోడ్డు మరమ్మతు పనుల్లో నాణ్యతాలోపం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

పలు ప్రాంతాల్లో రాకపోకలకు ఇబ్బందులు



జేపీఎన్‌నగర్- ప్రశాంత్‌నగర్ రోడ్ల దుస్థితి



మియాపూర్: ఏ రోడ్డు చూసినా గుంతలే. రాకపోకలకు అవస్థలే.. దీనికితోడు కొన్నిచోట్ల ఓవైపు రోడ్డు కుంగింది. ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్నాయి. నెల రోజుల కిందట గుంతలకు బీటీ మరమ్మతులు చేశారు. చిన్నపాటి వర్షాలకే బీటీ కొట్టుకుపోయి మరలా గుంతలు దర్శనమిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ గుంతల్లో నీరు నిలిచి వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

- మియాపూర్‌లోని జేపీఎన్‌నగర్ నుండి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం రోడ్డు, కృషినగర్ ప్రధాన రోడ్డు, దీప్తిశ్రీనగర్ నుండి శాంతినగర్ వెళ్లే రోడ్డు, ఎఫ్‌సిఐ వెళ్లే రోడ్డు, న్యూ కాలనీ, బస్తీలలో రోడ్లు గుంతలుపడ్డాయి.
- ఈ రోడ్ల వెంబడి ప్రతిరోజు వందల సంఖ్యలో వాహనదారులు ప్రయాణిస్తుంటారు. ఈ క్రమంలో తరచూ ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతుంది.
- మియాపూర్ డివిజన్ పరిధిలోని కాలనీ, బస్తీలలో డ్రైనేజీ, వరదనీటి పైపులైన్ పనుల నిమిత్తం తవ్విన ప్రాంతంలో తూతూ మంత్రంగా మరమ్మతులు చేయడంతో మూన్నాళ్లకే కంకర తేలిపోతోంది.
- విశ్వేశ్వర కాలనీలో మియాపూర్ పోలీస్‌స్టేషన్ ముందు రోడ్డులో డ్రైనేజీ పైప్ లైన్ల నిమిత్తం గత 6 నెలల క్రితం రోడ్డును తవ్వారు.పనులు పూర్తయ్యాక చేపట్టిన మరమ్మతు పనుల్లో నాణ్యత పాటించకపోవడంతో నెల రోజుల్లోనే తవ్విన ప్రాంతంలో గుంతలు ఏర్పడ్డాయి. కంకరతేలిన ప్రదేశంలో వాహనదారులు జారి పడుతున్నారు.
- బీటీ రోడ్డు మరమ్మతుల సమయంలో గుంతలు ఉన్నచోట నీరు తొలగించి చతురస్రాకారంలో తవ్వి బీటీవేసి రోలర్‌తో తొక్కించాల్సి ఉంటుంది. కానీ సిబ్బంది ఖ్లు, పారలతో చదునుచేయడంతో రోడ్డంతా ఎత్తు పల్లాలుగా మారుతున్నాయి. దీంతో బాగు చేసినా ఫలితం లేకుండా పోతుందని స్థానిక ప్రజలు వాపోతున్నారు.



ఎఫ్‌సీఐ కాలనీ ప్రధానరోడ్డులో గుంతలు

ఉన్నతాధికారులు స్పందించాలి

మియాపూర్‌లోని ప్రధాన రహదారులు గుంతలమయంగా మారాయి. దీంతో ప్రయాణాలు చేయాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతు పనుల్లో నాణ్యత లేకపోవడంతో లక్షల రూపాయలు వెచ్చించినా ప్రయోజనం లేకుండా పోతోంది. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. – రవీందర్, మియాపూర్

సమాజాభివృద్ధిలో యువత కీలకం

రాయదుర్గం: సమాజాభివృద్ధిలో యువత కీలకం అని వక్తలు పేర్కొన్నారు. రాయదుర్గంలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌డీడీఐ) హైదరాబాద్ లో 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ ఆదేశంపై విద్యార్థులలో మాదకద్రవ్య రహిత జీవనశైలిని ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఎఫ్‌డీడీఐ-హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ తేజ్‌లోహిత్‌రెడ్డి నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీడీఐ విద్యార్థులచే మాదకద్రవ్యాలను వినియోగించమని, స్నేహితులు, తోటివారిని కూడా వినియోగించకుండా చూస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత, విద్యార్థులలో డ్రగ్స్ వినియోగం లేకుండా చేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతోందన్నారు. మన జిల్లా, రాష్ట్రం మాదకద్రవ్యరహిత ప్రాంతాలుగా మారేలా మనమంతా సమిష్టిగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్‌డీడీఐ ఫ్యాకల్టీ, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

రెడీమిక్స్ లారీ బోల్తా..



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని లక్ష్మీవిహార్ కాలనీ సమీపంలో సోమవారం తెల్లవారుజామున రెడీమిక్స్ లారీ బోల్తా పడింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. లారీని తొలగించేందుకు రెండు గంటలకు పైగా సమయం పట్టిందని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ తెలిపారు. ఆఫీసులు, స్కూల్స్ సమయం కావడంతో నల్లగండ్ల సర్కిల్‌లో ట్రాఫిక్ జామ్ అయింది.

శాంటామారియా విద్యార్థుల ప్రతిభ



వివిధ దేశాల విద్యార్థులతో శేరిలింగంపల్లి శాంటా మారియా విద్యార్థులు ధృతి, మోహినీష్

శేరిలింగంపల్లి: అమెరికాలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో ఐఎస్‌పీ ఆధ్వర్యంలో నిర్వహించిన మోడల్ యునైటెడ్ నేషన్ వేసవి శిబిరంలో శాంటామారియా విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చారు. ఈ శిబిరానికి వివిధ దేశాల నుంచి 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పరిశోధన, సహకారం, దౌత్యంపై చర్చ జరిగింది. ఇందులో శాంటామారియా విద్యార్థులు ధృతి, మోహినీష్‌లు ప్రతిభ కనబరిచారు.

నిబద్ధతతో పనిచేస్తే గుర్తింపు వస్తుంది

కృష్ణా యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొ.వెంకయ్య

రాయదుర్గం: మనం నిబద్ధతతో పని చేస్తూ ముందుకు సాగాలని, గుర్తింపు అదే వస్తుందని కృష్ణా యూనివర్సిటీ మాజీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి వెంకయ్య పేర్కొన్నారు. గచ్చిబౌలి మనూలోని సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్‌స్కీమ్‌ల సహకారం, యూజీసీ మాలవ్య మిషన్ టీచర్స్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న మూడు రోజుల సంస్థాగత అభివృద్ధి ప్రణాళిక(ఐడీపీ) వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత ఒక ప్రయాణమని, అది గమ్యం కాదన్నారు. అత్యంత ప్రతిభావంతమైన విద్యాసంస్థల్లో నిలబడటానికి వ్యూహం రూపొందించుకోవాలన్నారు. ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ రహమాన్ మాట్లాడుతూ మనూ 2022లో ఏప్లస్ గ్రేడ్‌ను పొందిందన్నారు. కార్యక్రమంలో మనూ రిజిస్ట్రార్ ప్రొ.ఇష్తియాక్ అహ్మద్, రిసోర్స్‌పర్సన్ డాక్టర్ అలోసియస్ సిక్వేరా, ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సల్మా అహ్మద్ ఫారూఖీ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సయ్యద్‌అమన్ ఉబేద్ పాల్గొన్నారు.

ఏబీవీపీ నిరసన

రాయదుర్గం: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు వ్యతిరేకంగా సంఘీభావ సమావేశాన్ని సోమవారం రాత్రి గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలోని కార్గిల్‌చౌక్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ విద్యార్థులు ప్లకార్డులు ధరించి నిరసన తెలిపారు. ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షుడు బాలకృష్ణ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరగడం గర్హనీయమన్నారు. ప్రపంచంలో భారతీయులకు న్యాయం జరగాలని కోరుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు ఏబీవీపీ నాయకులు, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగురవేయాలి



బైక్‌ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, బీజేపీ నాయకుడు రవికుమార్‌యాదవ్

- కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి
- నానక్‌రాంగూడలో హర్ ఘర్ తిరంగా బైక్‌ర్యాలీ

రాయదుర్గం: ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి సూచించారు. ప్రధాని నరేంద్రమోడీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా నానక్‌రాంగూడలో భారీ బైక్‌ర్యాలీని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్ యాదవ్‌తో కలిసి ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కులమత ప్రాంతాలకు అతీతంగా అందరూ స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రతిపౌరుడు ఇంటిపై జెండా ఎగుర వేయాలన్నారు. నానక్‌రాంగూడలో ఆరంభమైన బైక్ ర్యాలీ విప్రో సర్కిల్, ఐటీ కంపెనీలు, ట్రిపుల్‌ఐటీ కూడలి, అపర్ణాసైరస్ పార్కు, మసీదుబండలోని బిక్షపతి నిలయం వరకు సాగింది. కార్యక్రమంలో పలువురు బీజేపీ, బీజేవైఎం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆల్విన్‌కాలనీలో తిరంగా యాత్రలో పాల్గొన్న బీజేవైఎం నాయకులు

బీజేవైఎం ఆధ్వర్యంలో..

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సోమవారం యాత్ర ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శైలేష్ ఆధ్వర్యంలో తిరంగా యాత్రను నిర్వహించారు. ఈ పాదయాత్రలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నరేందర్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్‌యాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకులు రవీందర్‌రావు, జిల్లా కార్యదర్శి స్రవంతి,సీనియర్ నాయకులు నర్సింగ్ యాదవ్, నరసింహాచారి, యువమోర్చా డివిజన్ అధ్యక్షులు రాహుల్, డివిజన్ ప్రధాన కార్యదర్శి జ్యోతి, మహిళా నాయకురాలు అనూష, బీజేవైఎం నాయకులు రాఘవాచారి, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

పటాన్‌చెరు: కాలనీలలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి సోమవారం అధికారులను ఆదేశించారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని నరేంద్ర కాలనీలో రహదారులను, పీఎస్‌ఆర్ కాలనీ, సాయి అంబికా కాలనీలలో జరుగుతున్న మంచినీటి పైపులైన్ల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిర్దేశించిన గడువులోపు పనులు పూర్తి చేయాలని సూచించారు. మున్సిపల్ పరిధిలోని ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

అదుపు తప్పిన ట్రాలీ ఆటో.. పాదచారి మృతి



గచ్చిబౌలి: వాటర్ క్యాన్‌ల లోడ్‌తో అతి వేగంగా వెళుతున్న ట్రాలీ ఆటో పల్టీ కొట్టడంతో అటుగా వెళుతున్న ఓ పాదచారి దుర్మరణం పాలైన ఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బిహార్ రాష్ట్రం ముజఫర్‌నగర్‌కు చెందిన ముఖేష్ కుమార్ మిశ్రా(32) ఆర్‌ఎంజడ్ బిల్డింగ్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. హఫీజ్‌పేట్‌కు చెందిన సోఫియా వాటర్ డిస్ట్రిబ్యూటర్ రమేష్ వద్ద బిహార్‌కు చెందిన ఆదిల్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ట్రాలీ ఆటోలో వాటర్ క్యాన్‌లు తీసుకొని సోమవారం ఉదయం 7.30 గంటల సమయంలో మై హోం భూజ నుంచి లింకు రోడ్డులో ప్రధాన రహదారి వైపు అతి వేగంగా వెళుతుండగా ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో అటుగా నడుచుకుంటూ వెళుతున్న పాదచారి ముఖేష్ కుమార్‌ను ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో డ్రైవర్ ఆదిల్ పరారీలో ఉన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం



శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించిన టీజీడబ్ల్యూసీడీసీ చైర్మన్ బండ్రు శోభారాణి, ఎండీ క్రాంతి వెస్లీ

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ మహిళా సహకార అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి సర్కిల్ ఆల్విన్ కాలనీ పైపులైన్ రోడ్డులోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో సోమవారం మహిళలకు ఎలక్ట్రికల్ ఆటో డ్రైవింగ్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వెస్లీలు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ శోభారాణి మాట్లాడుతూ ప్రతి మహిళా సాధికారత దిశగా పయనించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు ఉపాధి అవకాశాలకు పెద్ద పీట వేస్తున్నారన్నారు. 6 నుంచి 8 వారాల పాటు శిక్షణ ఇచ్చి డ్రైవింగ్ లైసెన్స్ అందించటానికి సహాయం అందిస్తారన్నారు. ఈ సదవకాశాన్ని ప్రతి మహిళా సద్వినియోగం చేసుకొని డ్రైవింగ్‌లో తర్ఫీదు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంగణం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మాదాపూర్: ఎమ్మెల్యే గాంధీ హయాంలో సోమవారం బీజేపీ మాదాపూర్ డివిజన్ అధ్యక్షులు మదనాచారి, డివిజన్ ఓబీసీ అధ్యక్షుడు సత్యం శ్రీధర్ ,బీఆర్‌ఎస్ పార్టీ మాదాపూర్ సోషల్ మీడియా అధ్యక్షుడు సంతోష్‌బాబు తదితర నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే వీరికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరిచూపు కాంగ్రెస్ వైపు ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడానికి వారధిగా పనిచేయాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎర్రగుడ్లశ్రీనివాస్ యాదవ్, జంగయ్యయాదవ్, అనిల్, మదనాచారి, సురేష్, రాకేశ్, బుజ్జి, రాజశేఖర్, పరమేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

నలుగురి రిమాండ్

మియాపూర్: యువతి ఆత్మహత్య కేసులో నలుగురిని రిమాండ్ చేశారు. మియాపూర్ సీఐ దుర్గా రామలింగప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం...మయూరినగర్‌లోని కోరుకొండ కోచింగ్ సెంటర్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న ఒడిశాకు చెందిన గీతాంజలి బారిక్(21) అదే క్యాంపస్‌లోని నాలుగో అంతస్తులో ఈ నెల 8వ తేదీన ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. కుటుంబసభ్యులు గీతాంజలి ఆత్మహత్యపై అనుమానం వ్యక్తం చేస్తూ శనివారం ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కోచింగ్ సెంటర్‌లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న జార్ఖండ్‌కు చెందిన ఆశిష్ కుమార్ మండల్, గౌతమ్‌కుమార్ మండల్, శంకర్‌ఠాకూర్, మిథున్ కుమార్ మండల్‌లు గీతాంజలిని అసభ్యకర పదజాలంతో వేధింపులకు గురిచేసినట్టు గుర్తించారు. అంతేకాక విచారణలో వారు వేధించినట్టు తేలింది. దీంతో ఆ నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

జర్నలిస్టుల ఇళ్ల కల సాకారం చేసేందుకు కృషి

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: జర్నలిస్టుల ఇళ్ల కల సాకారం చేసేందుకు కృషి చేస్తానని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. సోమవారం టీయూడబ్ల్యూజే-ఐజేయూ శేరిలింగంపల్లి నూతన ప్రెస్‌క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే-ఐజేయూ నాయకులు కొండా విజయ్‌కుమార్, సలీమ్‌పాషా, అశోక్‌యాదవ్, ప్రణయ్ ముదిరాజ్, శ్రీనివాస్, మల్లేష్, వరుణ్, గోవర్ధన్‌రెడ్డి, నాగరత్నం, మాధవరెడ్డి, తిరుపతిరెడ్డి, ప్రసాద్, సత్యనారాయణ, అనిల్‌రెడ్డి, జయరామ్, ప్రభాకర్, రమేష్, శంకర్, నర్సింహ, మహేందర్, సతీష్, వెంకటేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ కింద ఇండోర్ క్రీడా ప్రాంగణం



పూర్తి కావొచ్చిన క్రీడా ప్రాంగణం

తుదిదశకు పనులు

- నెలాఖరులోగా అందుబాటులోకి..
- సరికొత్త ప్రణాళికలతో అధికారులు

కేపీహెచ్‌బీ కాలనీ: కేపీహెచ్‌బీలోని ఫ్లై ఓవర్ కింద భాగంలో ఇకపై ఇండోర్ క్రీడలు కూడా ఆడవచ్చు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు నిర్మితమైన ఫ్లైఓవర్ బ్రిడ్జి కింది స్థలాన్ని సద్వినియోగం చేసుకునేలా జీహెచ్‌ఎంసీ అధికారులు సరికొత్త ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే మంజీరామాల్ వద్ద ఫ్లై ఓవర్ కింది భాగంలో పచ్చదనం, చెట్లు మానవాళి మనుగడకు ఏవిధంగా దోహదపడతాయో తెలిపే చిత్రాలను బ్రిడ్జి పిల్లర్లపై వేయడం ద్వారా జీహెచ్‌ఎంసీ అధికారులు స్థానికుల ప్రశంసలు పొందారు.మూసాపేట సర్కిల్ అధికారులు ఫోరంమాల్ ఎదుట బ్రిడ్జి కింది భాగాన్ని వినూత్న రీతిలో అందుబాటులోకి తీసుకువస్తున్నారు. గత జోనల్ కమిషనర్ మమత హయాంలో ఇక్కడి ఖాళీ స్థలాన్ని ద్విచక్ర వాహనాల మోడల్ పార్కింగ్ కేంద్రంగా తీర్చిదిద్దినప్పటికీ వాహనదారుల నుంచి స్పందన కరువైంది. వ్యాపార, వాణిజ్య కేంద్రాలకు నిలయంగా మారిన కేపీహెచ్‌బీ కాలనీలో ద్విచక్ర వాహనాల పెయిడ్ పార్కింగ్‌కు స్పందన లేకపోవడంతో దానిని తొలగించారు. దాని స్థానంలో చిన్నారులు, యువత ఆడుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

15లోపు పూర్తి చేస్తాం..

మినీ క్రీడలకు అనువుగా రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాంగణాన్ని ఈ నెల 15లోగా పూర్తి చేస్తాం. నెలాఖరులోగా ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం. ఇందులో స్కేటింగ్, మినీ ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ వంటి ఆటలు ఆడుకోవచ్చు. – ఏఈ సాయిప్రసాద్

సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

హెచ్‌సీయూ ఆంగ్ల శాఖాధిపతి ఆచార్య మురళీమనోహర్



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌సీయూ ప్రొ.మురళీమనోహర్

చందానగర్: ప్రస్తుతం యువత ప్రపంచ స్థాయి సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవడంలో వెనుకంజలో ఉన్నారని, సాంకేతికతపై పట్టు సాధించేలా ముందుకు సాగాలని హెచ్‌సీయూ ఆంగ్ల శాఖాధిపతి ఆచార్య దాసరి మురళీమనోహర్ పేర్కొన్నారు. ఏ దేశమైనా అభివృద్ధిలో ముందుకుసాగాలంటే యువత కీలకం అని తెలిపారు. హఫీజ్‌పేట్‌లోని కల్లం అంజిరెడ్డి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అంటేనే శక్తి, మెరుపు వేగం, వినూత్న ఆలోచనలు ,తలచుకుంటే ఏదైనా చేసి చూపించే సత్తా వారి సొంతమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ గణేష్, ఇన్‌చార్జీ శ్రీనివాస్, అసోసియేషన్ సభ్యులు ధర్మసాగర్, మల్లేష్, పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.